

నువ్వా నేనా 'సై'

నిలువరిస్తున్న యువకులు

దిగువ గెరిగిదొనలో జల్లికట్టు

వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీ దిగువ గెరిగిదొనలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. ఆ గ్రామంలో అల్లిని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు అల్లిలో నిలబడి గిత్తలను ఆపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పలువురు గిత్తల కింద పడ్డారు. పట్టీలు దక్కించుకున్న యువకులు ఖుషీగా వెనుతిరిగారు. జల్లికట్టు నిర్వహణతో ఆ గ్రామంలో జనసందడి ఏర్పడింది.

- వెదురుకుప్పం

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామి దర్శనానికి జిల్లా నలు మూలల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి.

- ఐరాల(కాణిపాకం)



స్వామి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఒక్కరోజులో..



తన అనుచరులతో పవన్‌ను కలిసిన ఆరణి శ్రీనివాసులు

ఆదివారం.. ఈ ఒక్కరోజే చిత్తూరు రాజకీయాల్లో ఎన్నో పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హైదరాబాదులో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు టీడీపీకి మద్దతిచ్చారు. ఆ పార్టీ కండువాతో సమావేశంలోనూ పాల్గొన్నారు. బలిజసంఘం నేతలు సమావేశమై టీడీపీ అభ్యర్థి గురజాలకు మద్దతు ప్రకటించారు. ఇలా చోటుచేసుకున్న పరిణామాలన్నీ తెలుగుదేశం పార్టీని మరింత పటిష్ఠపరిచేవే.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

- మారిపోయిన చిత్తూరు రాజకీయం
- పవన్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్యే ఆరణి
- టీడీపీకి సీకే మద్దతు
- తెలుగుదేశానికి సానుకూల పరిణామాలు

గతంలో టీడీపీ, ప్రజారాజ్యం పార్టీల్లో పనిచేసిన ఆరణి శ్రీనివాసులు.. 2009లో ప్రజారాజ్యం నుంచి.. 2014, 19 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. పేరుకే ఈయన ఎమ్మెల్యే అయినా వ్యతిరేకవర్గం విజయానందరెడ్డికే పనులు అయ్యేవి. ఈ ఐదేళ్లు ఆయన అవమాన భారంతో నలిగిపోయారని చెప్పొచ్చు. ఎమ్మెల్యే టికెట్ తనకేనని చాలాకాలం కిందటే విజయానందరెడ్డి ప్రకటించి, తదనుగుణంగా వర్గాన్ని సమీకరించుకునే పనిలో ఉన్నారు. ఇది బలిజల సీటు అనే నమ్మకంతో ఆరణి కూడా సైలెంట్‌గా ఉండిపోయారు. తీరా ఎన్నికల సమయంలో వైసీపీ అధిష్ఠానం విజయానందరెడ్డికి టికెట్ ఇచ్చింది. ఆరణి శ్రీనివాసులును రాజ్యసభకు పంపిస్తానని చెప్పి మోసం చేసి, వేరేవాళ్లకు అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్యే టికెట్ రాకపోవడం, రాజ్యసభకు పంపకపోవడంతో ఆయన మరింత కుంగిపోయారు. ఈ క్రమంలో ఆయనకు బలిజ సంఘం మద్దతుగా నిలిచింది. తనకు టికెట్ ఇవ్వకున్నా.. రాజ్యసభకు పంపిస్తామని మోసంచేసినా.. పూతలపట్టు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం తరహాలో ఆరణి తన అసంతృప్తిని వెల్లగక్కలేదు. సైలెంట్‌గా చేయాల్సిందంతా చేసేశారు. ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఆయన.. నాలుగు రోజుల్లో అధికారికంగా మంగళగిరి కార్యాలయంలో జనసేనలో చేరనున్నారు. టీడీపీ-జనసేన పొత్తు నేపథ్యంలో చిత్తూరులో గురజాల గెలుపునకు ఆరణి కృషి చేయాల్సి వస్తుంది. ఆ మేరకు సిద్ధమైనట్లు ఆయన వర్గీయులు అంటున్నారు. కాగా, రాజంపేట లోకసభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆరణి ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పవన్‌ను ఈయనతో పాటు శివ, వినాయక బాలాజీ కలవగా.. తిరుపతి నేతలు హరిప్రసాద్, కిరణ్ రాయల్ వెంట ఉన్నారు. పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే కలిసిన విషయం తెలుసుకున్న వైసీపీ అధిష్ఠానం ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది.

బలిజ సంఘం కూడా..

బలిజ సేవా సంఘం అధ్యక్షుడు ఓఎం రాందాసు, ప్రముఖ పారిశ్రామికవేత్త డీకే బద్రినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులోని బలిజ సేవా సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మాజీ మేయర్ కటారి హేమలత, కాజూరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ హాజరై వీరి మద్దతు కోరారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు బలిజ కులస్థులందరూ సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు.

టీడీపీకి మద్దతిచ్చిన సీకే



సీకే బాబు, చంద్రప్రకాష్, గురజాల జగన్మోహన్‌ను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు

ఓసారి స్వతంత్ర, మూడుసార్లు కాంగ్రెస్ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచిన సీకే బాబు.. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు మద్దతు ప్రకటించారు. చాలాకాలం ఈయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదివారం తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ కూడా హాజరై మద్దతు కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. పార్టీ విజయానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. యువనేతలను రాజకీయాల్లో ప్రోత్సహించాలన్నారు. తన అభిమానులకు, కుటుంబ సభ్యులకు గురజాలను పరిచయం చేసి ఆయన గెలుపునకు సహకరించాలని కోరారు. టీడీపీ నేత చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీకే బాబు, ఆయన అనుచరులతో కలిసి ఆర్‌ఎల్ కల్యాణ మండపంలో జరిగిన సమావేశానికి గురజాల ర్యాలీగా వెళ్లారు.

బెంగళూరు నుంచి ర్యాలీగావస్తున్న పార్టీ అభిమానులు



చర్చనీయాంశంగా కార్ల ర్యాలీ

బెంగళూరులో నిర్మాణ రంగంలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు మద్దతుగా ఆదివారం అక్కడ్నుంచి చిత్తూరుకు 400 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. బంగారుపాళ్యం సమీప టోల్‌గేట్ వద్ద కార్ల ర్యాలీకి గురజాల జగన్మోహన్ స్వాగతం పలికారు. అక్కడ్నుంచి చిత్తూరు నగరం మీదుగా ర్యాలీగా ఆర్‌ఎల్ కల్యాణ మండపం వరకు వెళ్లారు. గురజాలకు మద్దతిచ్చి వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుంటామని వారు ప్రకటించారు. ఈ సమావేశానికి టీడీపీ నాయకులు దొరబాబు, చంద్రప్రకాష్, హేమలత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్ల ర్యాలీ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

'తిరుపతి'కి పెరిగిన పోటీ

- టీడీపీ, జనసేన నుంచి ప్రచారంలో ఇతర ప్రాంతాల నేతల పేర్లు

తిరుపతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ సీటు కోసం టీడీపీ, జనసేన పార్టీల్లో పోటీ పెరుగుతోంది. ఇదివరకూ నియోజకవర్గానికి చెందిన నేతలు మాత్రమే పోటీ పడగా, ఇపుడు ఇతర ప్రాంతాల వారి పేర్లూ తెరపైకి వస్తున్నాయి. టీడీపీ నుంచి ప్రముఖ వ్యాపారవేత్త గంటా నరహరి పేరు హఠాత్తుగా ప్రచారంలోకి వచ్చింది. జనసేన టికెట్ రేసులో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిలిచారు. ఈ పరిణామాలు తిరుపతి నియోజకవర్గంలో కలకలం సృష్టిస్తున్నాయి.

టీడీపీ నుంచి ప్రచారంలో గంటా నరహరి పేరు

తిరుపతిలో టీడీపీ టికెట్ కోసం ఇప్పటికే చాలామంది రేసులో ఉన్నారు. బలిజ సామాజికవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాసులు, ఎడిఫై విద్యా సంస్థ యజమాని ప్రణీత్, ఎలైట్ ఆస్పత్రి యజమాని కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు, బీసీ సామాజికవర్గం నుంచి నరసింహ యాదవ్, రెడ్డి సామాజికవర్గం నుంచీ మబ్బు దేవనారాయణరెడ్డి తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. వీరంతా తిరుపతి నియోజకవర్గానికి చెందిన వారు. బలిజ సామాజికవర్గం అధికంగా ఉన్నంతున ఆ వర్గానికే టికెట్ కేటాయించాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది. అది కూడా పొత్తులో జనసేనకు సీటు కేటాయించని పక్షంలో. అయితే అధికార పార్టీ నేతల దౌర్జన్యకర సంస్కృతిని బలంగా ఎదిరించలేకపోతున్నారని కొందరిని, సామాజిక సమీకరణల్లో మరికొందరిని, ఆర్థికంగా బలంగా లేరన్న కారణంతో మరికొందరిని... పరిగణనలోకి తీసుకునేందుకు అధిష్ఠానం తటపటాయిస్తోంది. దీంతో టికెట్ ఎవరికి దక్కుతుందో అంతుబట్టక తిరుపతిలో టీడీపీ వర్గాలు అయోమయంలో వున్నాయి. ఇలాంటి తరుణంలో హఠాత్తుగా గంటా నరహరి పేరు తెరపైకి వచ్చింది. చిత్తూరు మాజీ ఎమ్మెల్యే దివంగత సత్యప్రభ సోదరి అల్లుడైన ఇతడిని ఇదివరకూ చంద్రబాబు మదనపల్లె మినీ మహానాడులో రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. కొంతకాలం రాజంపేట లోక్‌సభ పరిధిలో చురుగ్గా పనిచేసిన ఆయనకు ఎంపీ సీటు కాకుండా రాజంపేట అసెంబ్లీ సీటు కేటాయిస్తారన్న ప్రచారం జరిగింది.ఇప్పుడు వున్నట్టుండి తిరుపతి టీడీపీ టికెట్ ఆయనకే దక్కుతుందన్న ప్రచారం మొదలైంది. తిరుపతిలో బలిజ సామాజికవర్గం బలంగా వుండడం, ఆ వర్గాలకు డీకే ఆదికేశవులు కుటుంబం పట్ల గౌరవాభిమానాలున్న నేపథ్యంలో ఆ కుటుంబం తరపున నరహరి తిరుపతిలో పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారని సమాచారం. ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో అధికార పార్టీ అభ్యర్థిని మించి ఖర్చు పెట్టగలిగిన శక్తి వుందని, అందువల్లే అధిష్ఠానం నరహరి వైపు మొగ్గు చూపుతోందన్న ప్రచారం సాగుతోంది.

జనసేన టికెట్ రేసులో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి

అనూహ్య పరిణామాల నడుమ తిరుపతి జనసేన టికెట్ రేసులో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిలిచారు. ఈసారి చిత్తూరు టికెట్ ఆయనకు ఇవ్వకపోవడం.. రాజ్యసభ అవకాశాన్ని ఇస్తామని మొండిచేయి చూపడంతో అసంతృప్తికి లోనైన ఆయన.. ఆదివారం హైదరాబాదులో జనసేనాని పవన్ కల్యాణ్‌ను కలిశారు. అక్కడ నుంచి వెనుదిరిగాక తిరుపతిలో బలిజ సామాజికవర్గానికి చెందిన పలువురు ముఖ్యులకు ఆరణి శ్రీనివాసులు ఫోన్లు చేసి తనకు తిరుపతి జనసేన టికెట్ వచ్చే అవకాశముందని, సాయం చేయాలని కోరినట్టు తెలిసింది. క్లాస్ వన్ కాంట్రాక్టరైన శ్రీనివాసులు కూడా ఆర్థికంగా బలమైన వ్యక్తి. తిరుపతిలో వైసీపీ అభ్యర్థిని ఎదుర్కొనే విషయంలో ఆర్థికంగా పోటీ పడే సామర్థ్యం ఉంది. ఈ ఫోన్ కాల్స్ సమాచారం బలిజ సామాజికవర్గంలోనూ, జనసేన పార్టీలోనూ వేగంగా ప్రచారం కావడంతో రాజకీయంగా కలకలం రేగింది. పొత్తులో భాగంగా ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ నుంచీ గంటా నరహరి లేదా జనసేన నుంచీ ఆరణి శ్రీనివాసులుకు అవకాశం ఇచ్చినా ఇద్దరూ బలమైన అభ్యర్థులే అవుతారన్న భావన రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇవి ప్రచారాలుగానే మిగిలిపోతాయా లేదా ఇద్దరిలో ఒకరు ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం దక్కించుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారుతోంది.

స్వగ్రామానికి విజయకుమార్ మృతదేహం

- గ్రామస్తులు, బంధుమిత్రుల నివాళి
- నేడు రానున్న మోనిష్ పార్థివదేహం

బంగారుపాళ్యం, మార్చి 3: బంగారుపాళ్యం మండలం మండలంలోని నలగాంపల్లె పంచాయతీ కేసీ కండ్రిగ విషాదంలో మునిగిపోయింది. మహాబలిపురం సముద్రంలో శనివారం అలల తాకిడికి గల్లంతైన గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అసువులు బాశారు. శనివారమే బయటపడ్డ తులసీరామ్ కుమారుడు విజయ్‌కుమార్(19) మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థుల రోదనలతో గ్రామం శోకసంద్రమైంది. టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, ధరణీ నాయుడు, చిన్నయ్య, థామస్, పలువురు గ్రామస్థులు విజయకుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. కాగా, ప్రభుత్వ అధికారులు మాత్రం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు. ఇక, మోనిష్ మృతదేహం ఆదివారం మధ్యాహ్నం ఒడ్డుకు చేరుకుంది. మహాబలిపురం వద్దే పోస్టుమార్టం నిర్వహించి సోమవారం స్వగ్రామానికి తీసుకురానున్నట్లు బంధువులు తెలిపారు. ఇక, గల్లంతైన వారిలో సదుం మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ పెడకంటివారిపల్లెకు చెందిన ప్రభ ఉన్నారు. ఇతడి కోసం గాలిస్తున్నారు.



విజయ్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



విజయకుమార్ (ఫైల్ ఫొటో)

తొలిరోజు 97.24 శాతం

- మిగిలిన వారికి నేడు, రేపు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్న వైద్యసిబ్బంది

చిత్తూరు రూరల్, మార్చి 3: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మొదటి రోజైన ఆదివారం జిల్లాలో 204181 మంది 0-5 సంవత్సరం లోపు పిల్లలకు (97.24 శాతం) పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలోనే ఓపీవీ వ్యాక్సిన్లు 11777 మంది పిల్లలకు వేసినట్లు డీఐవో రవిరాజు తెలిపారు. మిగిలిన 5790 మందికి సోమ, మంగళవారాల్లో ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి చుక్కలు వేస్తారన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చిత్తూరు నగరం టెలిఫోన్ కాలనీ యూపీహెచ్‌సీలో అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, పల్స్ పోలియో అబ్జర్వర్ డాక్టర్ దేవసాగర్, డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి, డీఐవో రవిరాజు, అదనపు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి తదితరులు

కుప్పంలో 'బెదిరింపు' రాజకీయం!

- చంపేస్తానంటూ టీడీపీ సర్పంచి భర్తకు వైసీపీ కార్యకర్త ఫోన్
- డీఎస్పీకి ఎమ్మెల్సీ కంచర్ల ఫిర్యాదు

కుప్పం, మార్చి 3: 'మా జగన్‌ను విమర్శిస్తూ పోస్టులు పెడితే గొంతు కోస్తా'నంటూ టీడీపీ మహిళా సర్పంచి భర్తను వైసీపీ కార్యకర్త నవీన్‌కుమార్ ఫోన్లో చేసిన బెదిరింపు కుప్పంలో రాజకీయాలను వేడెక్కించింది. దీనిపై బాధితుడితోపాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదివారం డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు బాధ్యుడిపై వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత చంద్రబాబు డీజీపీకి లేఖ రాశారు.

హంద్రీ-నీవా కాలువ గురించి ఇటీవల గుడుపల్లె మండలం శెట్టిపల్లె సర్పంచి రీటా భర్త ఎల్లప్ప సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. దీంతో ఆగ్రహించిన అధికార వైపీపీ కార్యకర్త ఒకరు ఆయనను ఫోన్లో బెదిరించిన రికార్డు శనివారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. నవీన్ అని తనను తాను చెప్పుకున్న ఆ అధికార పార్టీ కార్యకర్త, జగన్‌కు తాను వీరాభిమానినని, ఆయనను ఎవరైనా ఏమన్నా అంటే ఊరుకునేది లేదని అన్నారు. ఆయనకోసం గొంతు కోసేందుకైనా, తాను గొంతు కోసుకుని ప్రాణాలు తీసుకునేందుకైనా సిద్ధమని ప్రకటించారు. మీ ఊరికి వచ్చి మరీ నీ అంతు తేలుస్తానంటూ బెదిరింపులకు దిగారు. ఈ బెదిరింపులన్నింటికీ ఎల్లప్ప ఆవేశపడిపోకుండా శాంతంగానే బదులిచ్చారు. అధికార పార్టీ కార్యకర్త బెదిరింపుల విషయాన్ని ఆదివారం ఆయన టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. తీవ్రంగా పరిగణించి ఎమ్మెల్సీ దీనిపై ఎల్లప్పతోపాటు తాను కూడా డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఎలా బెదిరిస్తారని, వెంటనే అధికార పార్టీ కార్యకర్తపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఫిర్యాదులో కోరారు. అనంతరం స్టేషన్ బయట ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వ లోపాలను ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరించడం ఏమి సంస్కృతి అని ప్రశ్నించారు. పోలీసులు వెంటనే ఈ బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఈ బెదిరింపులకు భయపడేవారు కారన్నారు.దీనిపై అవసరమైతే ప్రైవేటు కేసులు వేసి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ సురేశ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డీఎస్పీకి ఫిర్యాదు చేసి వెలుపలకు వస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

'అధికార' గూండాలపై చర్యలు తీసుకోండి

- డీజీపీకి చంద్రబాబు లేఖ

శెట్టిపల్లె సర్పంచి భర్త ఎల్లప్పను వైసీపీ కార్యకర్త బెదిరించడంపై ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై అధికార వైసీపీ బెదిరింపులకు పాల్పడడమే కాకుండా భౌతిక దాడులకు దిగడాన్ని తీవ్రంగా ఖండించారు. అటువంటి అధికార గూండాలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ డీజీపీకి ఆదివారం లేఖ రాశారు. 'రాష్ట్రం, ప్రత్యేకించి కుప్పం నియోజకవర్గం అంతటా శాంతిభద్రతలు క్షీణిస్తుండడం విచారకరం. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గ్రూపుల మధ్య శత్రుత్వం, విద్వేషాలు పెంచి హింసను రెచ్చగొట్టేందుకు అధికార వైసీపీ నేరపూరిత కుట్ర పన్నినట్లు కనిపిస్తోంది. అధికార వైసీపీ గూండాలు, టీడీపీ క్యాడర్‌పైన, నేతలపైన భౌతిక దాడులు, మాటలతో బెదిరించడం, పరుష పదజాలంతో దుర్భాషలాడుతున్నారు. తమ నేత ఎల్లప్పను వైసీపీకి చెందిన నవీన్ కుమార్ ఫోన్‌లో బెదిరించడం అటువంటి సంఘటనే. దళిత వర్గానికి చెందిన ఎల్లప్పను నవీన్ కులం పేరుతో దుర్భాషలాడాడు. అతడి గొంతుకోసం చంపేస్తానని బెదిరించాడు. ఇలాంటి చట్టవిరుద్ధమైన, హత్యాపూరిత బెదిరింపు వ్యూహాలకు మనలాంటి ప్రజాస్వామ్య, శాంతియుత సమాజంలో స్థానం లేదు. అందువల్ల అటువంటి గూండాలపై చట్టపరమైన చర్యలు చేపట్టండి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం కులం పేరుతో దూషించినందుకు నవీన్‌పై చర్య తీసుకోవడం చాలా ముఖ్యం. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా మీరు తీసుకునే సత్వర చర్య మాత్రమే హామీ ఇస్తుంది' అని ఆ లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రామకుప్పంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనాథ్

రామకుప్పం, మార్చి 3: రామకుప్పం పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం కుప్పం డీఎస్పీ శ్రీనాథ్ సందర్శించారు. రికార్డులను పరిశీలించి, స్థానిక పోలీసులకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం పలువురు రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్‌లున్నారు.

సోమల : మండలంలోని 13 మంది రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లతో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఏదైనా తగాదాలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీతోనే ఉజ్వల భవిష్యత్తు



కుప్పంలో ప్రచారం చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, మార్చి 3: తెలుగుదేశంతోనే పేదలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం 23, 24 వార్డుల్లో ఆయన అనుచరులతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ఒరిగింది ఏదీ లేదన్నారు. చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు విస్తృత ప్రచారం చేశారు.

బీజేపీ ప్రజాపోరు యాత్ర



సోమల, మార్చి 3: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఆ పార్టీ పుంగనూరు కన్వీనర్ గన్నా మదన్‌మోహన్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాపోరు యాత్ర నిర్వహించి కరపత్రాలను అందజేశారు. చిరు వ్యాపారస్తులకు ముద్ర స్కీం ద్వారా బ్యాంకుల్లో తక్కువ వడ్డీతో రూ.50 వేలు వరకు రుణాలు ఇచ్చారన్నారు. రాబోవు ఎన్నికల్లో పీఎంగా నరేంద్ర మోదీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శీలం రామూర్తి, నవీన్, రత్నయ్య, యుగంధర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న జోయలుక్కాస్ ఫౌండేషన్ ఆర్ఎం రిజిష్

బైరెడ్డిపల్లె, మార్చి 3 : గురుకుల పాఠశాల విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో సాయిలీల ఆకాంక్షించారు. కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో జోయలుక్కాస్ ఫౌండేషన్ సహకారంతో రూ.22 లక్షలతో పునర్నిర్మించిన బాలికల వసతిగృహ ప్రారంభోత్సవం కోలాహలంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జోయలుక్కాస్ ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ రిజిష్ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఉత్తమఫలితాలతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం జోయలుక్కాస్ ఫౌండేషన్ ఆర్ఎం రిజిష్, బీఎం దేవదాసన్‌ను ఎంఈవో, ప్రిన్సిపాల్ శోభ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సురేంద్రనాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ రూపాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు కరాటే నేర్చుకోవడం అవసరం

పుంగనూరు రూరల్, మార్చి3: విద్యార్థులు విద్యతోపాటు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవడం చాలా మంచిదని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాటిమాకులపాల్యెంలోని బీవీకే శ్రీచైతన్య చిల్డ్రన్స్ అకాడమిలో జరిగిన కరాటే పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో దాదాపు 30మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచడంతో వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరితారెడ్డి, నికిల్, హేమంత్, మాస్టర్ రెడ్డిమహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు జనసేన సైనికులు సన్నద్ధం కావాలి

శాంతిపురం, మార్చి 3: జనసేన సైనికులు ఎన్నికలు సన్నద్ధం కావాలని మండల అధ్యక్షుడు కిషోర్ పిలుపునిచ్చారు. ఆదివారం శాంతిపురం జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామానికి వెళ్లి ప్రతి ఇంటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కుప్పంలో జనసేన, టీడీపీ ఉమ్మడిగా అభ్యర్థిగా చంద్రబాబు పోటీ చేస్తున్నారని, ఈ సారి ఎన్నికల్లో లక్ష మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ సురేష్ బాబు, వామనమూర్తి, రామమూర్తి, వేణు, నవీన్, వీర మహిళ కుసుమ, సుబ్రమణ్యం, ధనుష్, రవితేజ, శ్రీకాంత్, రవీంద్ర పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో ఘనంగా ఉరుసు

బైరెడ్డిపల్లె, మార్చి 3 : పట్టణంలో వున్న హజరత్ బిస్మిల్లాషాఖాదరి దర్గా ఉరుసు రెండురోజుల పాటు గంధం ఊరేగింపు బ్యాండు మేళాలు, కొల్లం పకీర్ల జోహార్లతో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి దర్గావద్ద జరిగిన ఖవ్వాలి పాటకచ్చేరి ఆహూతులను అలరింపజేసింది.

రానున్న ఎన్నికల్లో యువతే కీలకం : ఎమ్మెల్సీ కంచర్ల





సమావేశానికి హాజరైన తెలుగు యువత, జనసేన కార్యకర్తలు, మాట్లాడుతున్న కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మార్చి 3 : రానున్న ఎన్నికల్లో యువతే కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఈఎన్ఆర్ కల్యాణ మండపంలో జనసేన, తెలుగు యువతతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. అక్రమాలతో ప్రజాధనాన్ని దోచుకు తింటున్న వైసీపీని కూకటి వేళ్లతో పెకలించి పారేయాలన్నారు. అందుకు యువత ముందుండి ఎన్నికల్లో బూత్‌కు 20మంది సంసిద్ధం కావాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడి యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు సుబ్రమణ్యం, కుప్పం నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు రాజేంద్ర, మండల ఐటీడీపీ అధ్యక్షుడు మంజునాథ్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, నాయకులు శివకుమార్, నారాయణస్వామి, ప్రసాద్, మంజునాథ్‌గౌడు, భాస్కర్, అరుణ్‌కుమార్, మంజు పాల్గొన్నారు.

చల్లా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వారితో చల్లాబాబు

రొంపిచెర్ల, మార్చి 3: పుంగనూరు టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో రొంపిచెర్లలోని ఆయన ఇంటివద్ద ఆదివారం పులిచెర్ల మండలం పోచంవారిపల్లె పంచాయతీ దిన్నిపాటివారిపల్లె హరిజనవాడకు చెందిన సుమారు 30 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. జి.బాలజీ, పి.సురేంద్ర, జి.కిరణ్, బాబు, సునీల్, పి.కన్నయ్య, వినాయక, గణేష్, ఈశ్వరయ్య, ఏకాంబరంజీవ, కృష్ణయ్య, లోకేష్, గణేష్, తదితరులకు చల్లాబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ తెలుగుదేశంలోకి వచ్చిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కో-ఆర్డినేటర్ దేవా, సీనియర్ నాయకుడు కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, లేక్కల ధనంజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీని ప్రజల్లోకి తీసుకెళ్లండి

బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం రొంపిచెర్లలోని చల్లాబాబు ఇంటి వద్ద నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో పుంగనూరు, రొంపిచెర్ల, సోమల సదం మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి, ఉయ్యాల రమణ, సుబ్రమణ్యంనాయుడు, ప్రభాకరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సీవీ రెడ్డి, కుమార్‌రెడ్డి, పీఎం మల్లికార్జున, శివశంకర్ పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమి కొట్టాలి





సదుంలో పోలియో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డా.హర్షవర్ధన్, బైరెడ్డిపల్లెలో చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్

పుంగనూరు రూరల్, మార్చి3: పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లో మున్సిపల్ చైర్మన్ అలీంబాషాతో కలసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండల పరిధిలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వైద్యాధికారి సల్మా పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ సల్మా మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలో 3172మంది పిల్లలుండగా 3671మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు చందన, జోత్స్న, మాధవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరులోని విద్యానగర్ పాఠశాల ఆవరణలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటే గౌడ ప్రారంభించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాముండేశ్వరి పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, వైద్యాధికారులు నిరంజన్ కుమార్, మాధవి, పరమేశ్వరి, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. పలమనేరు మున్సిపాలిటీలో 25 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు ఆర్టీసీ బస్టాండులో ట్రాన్సిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో 6181 మంది పిల్లలకు గాను ఆదివారం 6074 మందికి , పలమనేరు మండలంలో 3460 మంది పిల్లలకు గాను 3386 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు.

బైరెడ్డిపల్లె : స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని ఆదివారం రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నిర్మూలనాధికారి డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి జయరాముడు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ విజయచందర్, డాక్టర్ శాలిని, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ఫార్మాసిస్ట్ సారామతి, ల్యాబ్‌టెక్నీషియన్ జీలాని, ఏఎన్ఎం అశ్విని పాల్గొన్నారు.

సదుం : సదుంలో 97 శాతం పోలియో చుక్కలు వేసినట్లు ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ భాస్కర్, నీలకంఠ తెలిపారు. సదుం బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి డా.హర్షవర్ధన్ తనిఖీ చేశారు.

కల్లూరు : పులిచెర్ల మండలంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ప్రారంభించారు వైద్యాధికారులు జానకీరావు, యల్లయ్య, షమామరెహ్మాన్ మాట్లాడుతూ మండలంలో చిన్నారులు 4254మంది ఉండగా 4159మందికి పోలియోచుక్కలు వేశామన్నారు.

సోమల : కందూరు సచివాలయంలో డీపీఎంవో హర్షవర్ధన్, ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచు బాషా మసూద్ పిల్లలకు పోలియో చుక్కలు వేసి కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే కరకమండలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచు కేవీ రమణ, ఎగువపల్లెలో జడ్పీటీసీ కుసుమ, నెల్లిమందలో ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణ ఆయా కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు.

రొంపిచెర : రొంపిచెర్లలోని పల్స్‌పోలియో కేంద్రాన్ని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి ప్రారంభించి పిల్లలకు పోలియోచుక్కలు వేశారు. మండలంలో 2800 మంది పిల్లలు ఉండగా 2748 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి వినయ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, వైద్యాధికారి దినేష్ కుమార్, హెచ్ఈ రాజేశ్వరి, సీహెచ్‌వో కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ పాల్గొన్నారు.

చౌడేపల్లె : స్థానిక హైస్కూల్లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని జడ్పీటీసీ దామోదర్‌రాజు ప్రారంభించారు. మండలంలో 4877 మంది చిన్నారులు లక్ష్యం కాగా 4887 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పూజ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం : విజలాపురంలో ఎమ్మెల్సీ భరత్, రామకుప్పంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యంలు పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రారంభించారు. రామకుప్పం పీహెచ్‌సీ పరిధిలో 3,497 మంది, విజలాపురం పీహెచ్‌సీ పరిధిలో 2,034మంది, వీర్నమల పీహెచ్‌సీ పరిధిలో 1,175మంది చిన్నారులకు పోలియో నివారణ చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటా వివరించాలి



గృహసారథుల శిక్షణలో మాట్లాడుతున్న మనోహర్

రామకుప్పం, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటా వివరించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు కోరారు. ఆదివారం రామకుప్పం మండలం విజలాపురంలో మహిళా గృహసారథుల శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమ ఫలాలు కొందరికే అందుతున్నాయన్నారు. దీనిని గుర్తించిన చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళా కో-ఆర్డినేటర్ కమతుమూరు ప్రతాప్, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, నేతలు రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, నందారెడ్డి, మనోహర్, విజయ్‌కుమార్‌రెడ్డి, జయశంకర్, కుమార్, శంకర్‌చలం, సుబ్రీ, బాలరాజు, మంజునాథ్, రామలింగారెడ్డి, మహిళనేతలు అనసూయ, పద్మమ్మ, అలివేలుమంగమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు టీడీపీని ఆదరించాలి

కుప్పం నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు టీడీపీని ఆదరించాలని చంద్రబాబు పీఏ మనోహర్ కోరారు. ఆదివారం ఆయన ఆనిగానూరులో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులతో సమావేశమయ్యారు. ప్రశాంత వాతావరణంలో జీవించాలంటే అది టీడీపీ పాలనలోనే సాధ్యమన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రజలు రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, జయశంకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నాగ బైరవ స్వామికి పూజలు



చౌడేపల్లె, మార్చి3:పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, నాగబైరవస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు సూపర్ 6 పథకాల ప్రచారం

శాంతిపురం, మార్చి 3 : మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో సోమవారం తెలుగుదేశం, జనసేన పార్టీల శ్రేణులు కలిసి సూపర్ 6 పథకాల గురించి ప్రచారం నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ఆశీర్వదించాలని కోరతామన్నారు. ఆయా పంచాయతీ నాయకులను, జనసేన నాయకులను కలుపుకొని కార్యక్రమం పూర్తి చేయాలని ఆయన తెలిపారు.

బంగాళాదుంప ఆకులు తిని మూడు పశువులు మృతి



బైరెడ్డిపల్లె, మార్చి3 :మండలంలోని మిట్ట కురప్పల్లెలో ఆదివారం బంగాళదుంప ఆకులు తిని మూడు పశువులు మృతిచెందినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు బంగాళాదుంప పంటలకు రెండురోజుల క్రితం క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. ఆదివారం ఉదయం మేతకు వెళ్లిన పశువులు బంగాళాదుంప ఆకులను తినడంతో అస్వస్థతకు గురై మృతిచెందినట్లు తెలుస్తోందని రైతులు తెలిపారు. రైతు నాగరాజుకు చెందిన రెండు ఎద్దులు, రైతు ఈశ్వరప్పకు చెందిన పాడిఆవు ఉన్నాయి. ఇదే ప్రభావంతో రైతు వినోద్‌కు చెందిన మూడు ఆవుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా వుండడంతో వైద్యం చేయిస్తున్నట్లు రైతులు తెలిపారు.

శ్రీవారికి కవచం వితరణ



పుంగనూరు రూరల్, మార్చి3: స్థానిక కోనేటి వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామికి దశావతార రాగిపై మెరుగుతో కూడిన కవచాన్ని పట్టణానికి చెందిన దాత హరినాథ్ కుటుంబసభ్యులు ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

74 మందికి కంటి పరీక్షలు



పలమనేరు, మార్చి3 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సాశిబిరంలో 74 మందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. చెన్నై శంకరనేత్రాలయ నేత్రవైద్యులు మురళి నేత్రపరీక్షలు నిర్వహించి 30 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఆపరేషన్లు చేసుకొనే వారికి చెన్నై శంకరనేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం, మార్చి 3: కుప్పంలోని గురుకుల పాఠశాల(బాలురు)లో 2024-2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 3, 4 తరగతులు పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీలోపు సూచించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 8185847668, 6303184748 అనే ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

జయహో బీసీ సభను విజయవంతం చేయండి

కుప్పం, మార్చి 3: మంగళగిరిలో ఈనెల 5వ తేదీన జయహో బీసీ సభ జరుగుతుందని రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు వైద్యం శాంతారాం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఈ సభకు బీసీలు అందరూ పాల్గొని విజయంతం చేయాలని ఆయన కోరారు.

7నుంచి కాళభైరేశ్వరస్వామి ఉత్సవాలు

బైరెడ్డిపల్లె, మార్చి 3 : తీర్థం-కోట్రేపల్లె సమీపంలో వెలసిన కాళభైరేశ్వరస్వామి ఉత్సవాలు ఈనెల 7వ తేది నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాజారెడ్డి తెలిపారు. 7వ తేది అంకురార్పణం, 8న ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, కలశస్థాపన, గిరిజా కల్యాణం, 9న రథోత్సవం, 10న ప్రాకారోత్సవం, దీపోత్సవం, 11న పుష్పపల్లకీ సేవ, 12వ తేది గ్రామోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఎమ్మెల్సీ కంచర్లపై పోలీసులకు ఫిర్యాదు

కుప్పం, మార్చి 3: ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించారంటూ విజయ్‌కుమార్ అనే వ్యక్తి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెస్కో చైర్మన్ సెంథిల్‌పై అనుచిత వ్యాఖ్యలు ఎందకు చేశారని తాను కంచర్లను ప్రశ్నిస్తే తనపై దాడికి పాల్పడటమే కాకుండా, కులం పేరుతో దూషించారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కంచర్లపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాల ఆ ఫిర్యాదులో కోరారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

బైరెడ్డిపల్లె, మార్చి 3 : బైరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్యనిపుణులు 43 మందికి వైద్యపరీక్షలు జరిపి 8మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి నిర్వాహకులు భోజనసౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసులు, మునెప్ప, శేషు తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు మానవాళికి ముప్పు

సోమల, మార్చి3: అడవికి నిప్పు మానవాళికి ముప్పని వైస్ ఎంపీపీ ప్రభాకర్ అన్నారు.ఆదివారం టీటీడీ కల్యాణ మండపం సమీపంలో ఊరకొండకు నిప్పు పెట్టడంతో మామిడి తోటలకు మంటలు వ్యాపించి జరిగిన నష్టాలను పరిశీలించారు. అడవికి నిప్పు పెట్టడంతో పశుగ్రాసం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోయారు. వేసవిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులను కోరారు.

బోయకొండ గంగమ్మకు పూజలు



చౌడేపల్లె, మార్చి 3: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, వేపాకు తోరణలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి, స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

7 నుంచి మల్లప్ప కొండలో శివరాత్రి వేడుకలు

గుడుపల్లె, మార్చి3: మల్లప్పకొండలోని మల్లేశ్వరుడి స్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలు ఈనెల 7 నుంచి 9వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 7వ తేది మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, 8వ తేది మల్లేశ్వరుడుకి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, స్వామివారి దర్శనం, 9వ తేది అభిషేకం, మహా మంగళహారతి నిర్వహించనున్నారు. కుప్పం నుంచి మల్లప్పకొండకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


కన్నప్ప ఆలయం వద్ద ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు


కొండపైకి భక్తకన్నప్ప ఊరేగింపు



భిక్షాల గాలి గోపురం వద్ద అలంకరణ


ముక్కంటీశుడి ధ్వజస్తంభం వద్ద పుష్పాలంకరణ

భక్తుడికే తొలి పూజ

- శ్రీకాళహస్తిలో ఆగమోక్తంగా 'భక్త కన్నప్ప' ధ్వజారోహణం
- ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

శ్రీకాళహస్తి, మార్చి 3: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం భక్త కన్నప్ప ఆలయం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. భక్తుడికి కొండపై స్థానం కల్పించి.. తొలి పూజను కూడా అతడికే జరిగేలా వాయులింగేశ్వర స్వామి వరమిచ్చిన కారణంతో కన్నప్ప ఆలయ ధ్వజారోహణ ఆగమోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ముక్కంటి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. కన్నప్ప ఉత్సవమూర్తిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అభిషేక పూజలు చేశాక మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కన్నప్ప కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ధ్వజస్తంభానికి పూజలు చేసి, హారతులు పట్టారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని ముక్కంటి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. సన్నిధి వీధిలో బోయ కులస్థుల ఏర్పాటు చేసిన విడిది మండపంలో కొలువుదీర్చారు. సంప్రదాయం ప్రకారం ఉభయదారులైన బోయలు వస్త్రం, నైవేద్యం సమర్పించాక గ్రామోత్సవం ప్రారంభమైంది. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవోలు ధనపాల్, ఇన్‌స్పెక్టర్ హరిబాబుయాదవ్, పర్యవేక్షకులు విజయసారథి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా దూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక ప్రదర్శనలను ఆదివారం ప్రారంభించారు. శ్రీకాళహస్తి క్షేత్రం విద్యుత్, పుష్పాలంకరణలతో ఆకట్టుకుంటోంది.

బ్రహ్మోత్సవాల్లో నేడు
- ఉదయం 9గంటలకు వెండి అంబారి సేవ
- మధ్యాహ్నం 12 గంటల నుంచి ముక్కంటి ధ్వజారోహణం ప్రారంభం
- రాత్రి 8గంటలకు వెండి అంబారి సేవ

ఏకాంతంగా ఆర్జిత సేవలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు జరిగే ఆర్జిత సేవలన్నీ ఏకాంతంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలు పూర్తయ్యేవరకు ప్రభాతసేవ, నిత్యోత్సవం, నిత్యకల్యాణం, చండీ, రుద్రహోమాలు, శయనోత్సవ సేవలను రద్దు చేశారు. రాహు, కేతు సర్పదోష నివారణ పూజలకు మహాశివరాత్రి రోజున మాత్రమే విరామం ఇవ్వడం ఆనవాయితీ. మిగిలిన రోజుల్లో యథావిధిగా సాగనున్నాయి.


నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

చిత్తూరు, మార్చి 3: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు.

- ఎస్పీ కార్యాలయంలో... జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.


తప్పే కొద్దీ తప్పులే

- ఆందోళనలో ఓటర్లు





మృతిచెందిన కాంతమ్మ, క్రిష్ణయ్య ఓటర్లే



అత్తారింటికి వెళ్లిన గునాకు కొనసాగుతున్న ఓటు

పెనుమూరు, మార్చి 3: తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని గతంలో ఉన్నతాధికారులు పదేపదే ఆదేశించినా తుది జాబితా ఇందుకు భిన్నంగా ఉంది. అధికారులు ఆదేశించినా తప్పులు దొర్లుతూనే ఉన్నాయి. తుది జాబితాలను పరిశీలిస్తే తప్పులు కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. పెనుమూరు మండలంలోని 40వ బూత్ లో వరుస సంఖ్య 168లో కాంతమ్మకు ఓటు ఉంది. అయితే ఈమె మరణించి చాలా కాలం అవుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. వసంతమ్మ కూడా చాలాకాలం కిందటే మృతిచెందినా వరుస సంఖ్య 355లో ఓటు హక్కు ఉంది. మృతుడు క్రిష్ణయ్య కూడా ఇక్కడ ఓటరే. అలాగే బి.ప్రీతి, పి.గునాకు పెళ్లై బయటి ప్రాంతాలకు వెళ్లిపోయినా తుది జాబితాలో వారికి ఓటు హక్కు కల్పించడం గమనార్హం.

- అలాగే, పెనుమూరు మండలంలోని బూత్ నెంబరు 9లో వరుస సంఖ్య 530లో దేవళ్ల రాజయ్యకు ఓటు హక్కు కల్పించారు. ఈయన మరణించి చాలా సంవత్సరాలు అవుతుంది. ఇదే బూత్‌లో వరుస సంఖ్య 671లో ఈశ్వరయ్యపీ అనే వ్యక్తికి ఓటుంది. ఆయన కూడా చనిపోయి చాలా సంవత్సరాలు అవుతుందని గ్రామస్థులు తెలిపారు.

భవిష్యత్తులో అమరలో ప్రపంచస్థాయి వైద్యసేవలు

గల్లా రామచంద్రనాయుడు



గల్లా దంపతులను సన్మానిస్తున్న డాక్టర్లు రమాదేవి, ప్రసాద్

రేణిగుంట, మార్చి 3: భవిష్యత్తులో అమర ఆస్పత్రిలో ప్రపంచస్థాయి వైద్యసేవలు అందిస్తామని అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు వెల్లడించారు. ఆదివారం రేణిగుంట - కడప మార్గంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమర ఆస్పత్రి మూడో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సొంత జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని భావించామన్నారు. అందుకే తాము అమరరాజ సంస్థలను ఇక్కడే నెలకొల్పామన్నారు. నేడు ప్రపంచస్థాయిలో అన్నిదేశాలకు తమ సంస్థ ఉత్పత్తులు పంపుతున్నామని చెప్పారు. అమర ఆస్పత్రి ఏర్పాటు చేసే సమయంలోనూ విశాఖపట్టణం, హైదరాబాదు నగరాల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని తమ కుటుంబంలో చర్చలు జరిగాయని వివరించారు. అయితే తిరుపతి సమీపంలో ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తే బాగుంటుందని సలహా ఇచ్చానన్నారు. తన ఆలోచనను అనుసరిస్తూ మూడేళ్ల క్రితం ఇక్కడ అమర ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. అనతికాలంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. మరో పదేళ్లలో ప్రపంచదేశాలలో లభించే వైద్యసేవలు లభించే అవకాశం ఉందన్నారు. మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి మాట్లాడుతూ పరిశ్రమలతో పాటు వైద్యరంగంలోనూ తమపిల్లలు ఏర్పాటు చేసిన ఆస్పత్రి సేవలు ఖండాంతరాల్లో పేరు గడించేలా డాక్టర్లు ప్రసాద్, రమాదేవి కృషి చేయడం అభినందనీయన్నారు. మాతృభూమికి సేవ చేసేందుకే అమెరికా నుంచి ఇక్కడికి వచ్చామని డాక్టర్ గౌరినేని ప్రసాద్ తెలియజేశారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలపై ఏనుగుల స్వైరవిహారం



పాకాల, మార్చి 3: పాకాల, ఐరాల మండలాల పరిధిలో పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె, చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె సమీపంలోని పంట పొలాలపై శనివారం రాత్రి ఏనుగుల గుంపు స్వైరవిహారం చేసింది. పదిపుట్లబైలు, కాకర్లవారిపల్లె సమీపంలోని శిలగొందిమూల అటవీ ప్రాంత వద్ద మామిడితోటలు, కూరగాయల పంటలను ధ్వంసం చేశాయి. చుక్కావారిపల్లె, గూబలవారిపల్లె పరిసరాల్లోని వరిపొలాలను తొక్కి తీవ్ర నష్టం కలిగించాయి. ఏనుగుల గుంపు సదుం మండల సరిహద్దు గుండాల కనుమ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. మళ్లీ తిరిగి పాకాల మండల పరిసరాల్లో పంటలపై ఏనుగుల గుంపు దాడి చేస్తుందని రైతులు భయపడుతున్నారు.

- సుప్రీంకోర్టు దయతో..

పుంగనూరులో మైకులో మాట్లాడుతున్నా

- ఐదేళ్లలో పెద్దిరెడ్డి రూ.35వేల కోట్ల దోపిడీ
- ధర్మపోరాట సభలో బీసీవై అధినేత రామచంద్రయాదవ్

పుంగనూరు, మార్చి 3: 'పుంగనూరులో సభ నిర్వహించేందుకు రెండన్నరేళ్లుగా పోరాడుతున్నా. స్థానిక అధికారుల నుంచి హైకోర్టు వరకూ వెళ్లినా అనుమతి రాలేదు. చివరకు సుప్రీంకోర్టు దయవల్ల ఇప్పుడు మైకు పట్టుకుని మాట్లాడే అవకాశం వచ్చింది' అని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరు మండలం చదళ్ల-కాటిపేరి రోడ్డులోని ఆయన మామిడి తోటలో జరిగిన బీసీవైపీ ధర్మపోరాటసభలో ప్రసంగించారు. పక్క నియోజకవర్గం నుంచి వలస వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్ల 15ఏళ్లుగా పుంగనూరులో రౌడీయిజం, అరాచకాలు, దోపిడీ, దౌర్జన్యాలు, పాలు, మైన్స్ భూముల కబ్జా, అక్రమాలు పెరిగిపోయాయని ప్రజలు గమనించాలన్నారు. ఫ్యాక్టరీల పేరుతో రైతుల వద్ద భూములను లాక్కున్న పెద్దిరెడ్డి.. ఒక్క ఫ్యాక్టరీని ఏర్పాటు చేయలేదన్నారు. గత ఎన్నికల్లో పెద్దిరెడ్డికి 1.07లక్షల మంది ఓట్లు వేయగా.. ఆ అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.35 వేల కోట్లు దోపిడీ చేశారన్నారు. చాలా మంది యువతను డ్రగ్స్ గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలుగా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి దౌర్జన్యాలను తరిమి కొట్టడమే ప్రధాన అజెండాగా రానున్న ఎన్నికల్లో తాను పుంగనూరు నుంచి పోటీ చేస్తున్నానని ప్రకటించారు. ఇక్కడ మార్పు కోసం ఇతర పార్టీలూ సహకరించాలని కోరారు.





సభలో ప్రసంగిస్తున్న బీసీవైపీ అధినేత రామచంద్రయాదవ్ - సభకు వచ్చిన వాహనాలు తనిఖీలు చేస్తూ వీడియో తీస్తున్న పోలీసులు

ప్రతిరైతుకు ఉచితంగా ఆవు ఇస్తా

తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి రైతు ఇంటికి ఉచితంగా పాడిఆవు ఇస్తానని రామచంద్రయాదవ్ హామీ ఇచ్చారు. ప్రతి మండలానికి ఒక డెయిరీ, చక్కెర పరిశ్రమను తిరిగి ప్రారంభిస్తానన్నారు. పతంజలి లాంటి పరిశ్రమ ఏర్పాటు చేయించి దాదాపు 5వేల మందికి ఉపాధి కల్పిస్తానని చెప్పారు. టమోటా, చింతపండు, మామిడి పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పులిచెర్ల- కేజీఎఫ్ రైల్వేలైన్ కేంద్రంతో పోరాడి తీసుకొస్తానని చెప్పారు. కాగా, పోలీసులు సభకు వెళ్లే రోడ్లు, సభకు వస్తున్న వాహనాలు, జనాలు వీడియోలు తీయడం, వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఆర్.హరినాథరెడ్డి, బీసీవై పార్టీ నాయకులు సాంబమూర్తి, ఆనంద్, హరియాదవ్, పాలరమేశ్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కిరణ్, శివకుమార్, నూర్, బక్షూ, విశ్వనాథరెడ్డి, సురేంద్ర, కేశవరెడ్డి, నారాయణస్వామి, వెంకటేశ్, శేషాద్రి, వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణవేణి, అధిక సంఖ్యలో బీసీవైపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సహకరించరనే..!

- 20 రోజులకే ఎస్పీ బదిలీ వెనుక కారణమిదేనన్న ప్రచారం

తిరుపతి జిల్లాగా ఏర్పడ్డాక నియమితులైన తొలి మహిళా ఎస్పీ.. మలికా గర్గ్. ఈమె గతనెల 12వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా 20 రోజుల్లోనే బదిలీ అయ్యారు. ఎన్నికల్లో తమకు సహకరించరని అధికార పార్టీ నేతలు నిర్ధారణకు రావడం వల్లే ఈ బదిలీ అన్న ప్రచారం జరుగుతోంది. - ఆంధ్రజ్యోతి, తిరుపతి

జిల్లాకు ఏ అధికారి వచ్చినా అధికార పార్టీ నేతలను కలిసి శాలువాలు కప్పడం.. పుష్పగుచ్ఛాలు ఇవ్వడం పరిపాటిగా మారింది. అయితే ఎస్పీగా వచ్చిన మలికా గర్గ్ ఇటువంటివేమీ చేయలేదు. దీన్ని అధికార పార్టీలో పలువురు ముఖ్య నేతలు జీర్ణించుకోలేకపోయారని తెలిసింది. బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే అవినీతి, విధి నిర్వహణలో అలసత్వం వంటి ఆరోపణలతో ఓ హెడ్ కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. వారిలో ఒకరిపై చర్యలు వెనక్కు తీసుకోవాలని అధికార పార్టీ కీలక నేత ఒకరు చెప్పినా ఎస్పీ వినిపించుకోలేదని పోలీసు వర్గాల సమాచారం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై అకారణంగా రౌడీషీట్ తెరుస్తున్నారని ఆ పార్టీ నేతలు ఎస్పీని కలసి ఆందోళన వ్యక్తం చేయడంతో వారిని సమాధానపరిచి విచారణకు ఉపక్రమించారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వారిని గుర్తించి బైండోవర్ చేయాలని, మూడుకు మించి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై రౌడీ షీట్లు తెరవాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఆ క్రమంలో అధికార పార్టీకి చెందిన వారిపైనే ఎక్కువగా రౌడీషీట్లు తెరిచారని తెలుస్తోంది. ఈ పరిణామాలు అధికార పార్టీ నేతలకు మింగుడుపడలేదు.

కొండపై నుంచీ చక్రం తిప్పిన అధికారికీ చుక్కలు చూపిన వైనం

ప్రత్యేకించి గతంలో తిరుమల కొండపై నుంచీ జిల్లా అంతటా చక్రం తిప్పిన ఓ పోలీసు అధికారి ఎన్నికల నేపథ్యంలో దిగువకు బదిలీ అయ్యారు. సీఎంకు సన్నిహితుడిగా పేరుపడ్డ ఆ అధికారికి బందోబస్తు డ్యూటీలు వేసే సాహసం ఏ అధికారీ చేయలేదు. అయితే మలికా గర్గ్ అలాంటి మినహాయింపులేమీ ఇవ్వకుండా బందోబస్తు డ్యూటీ చేయించారని సమాచారం. ఆమే ఎస్పీగా కొనసాగితే తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఎపిక్ కార్డుల కేసుల దర్యాప్తులో కూడా ఇబ్బందులు తప్పవని అధికార పార్టీ నేతలు, అందులో పాలుపంచుకున్న పోలీసు అధికారులు ఆందోళనకు గురైనట్టు ఆయా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ కారణాలకుతోడు ఎస్పీ తీరు గమనిస్తే వచ్చే ఎన్నికల్లో సహకరించే పరిస్థితి లేదని గ్రహించడంతోనే అధికార పార్టీ కీలక నేతలు సీఎంవోలో ఒత్తిడి తెచ్చి ఆమెను బదిలీ చేయించినట్టు రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. నిక్కచ్చిగా, నిజాయితీగా పనిచేస్తారని గుర్తింపు తెచ్చుకుంటున్న మహిళా పోలీసు అధికారిని కేవలం 20 రోజుల్లోనే అది కూడా ఎన్నికల సమయంలో బదిలీ చేయడం పట్ల అన్నివర్గాల నుంచీ విమర్శలు వస్తున్నాయి.


మలికా గర్గ్

తిరుపతి నూతన ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

- మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా బదిలీ చేసిన ప్రభుత్వం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 3: జిల్లాకు నూతన ఎస్పీగా విజయవాడ శాంతి భద్రతల విభాగం డీసీపీగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్పీగా పనిచేస్తున్న మలికా గర్గ్‌ను సీఐడీ ఎస్పీగా ఆదివారం ప్రభుత్వం బదిలీ చేసింది. 2018 బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్ పటేల్‌ను శిక్షణ అనంతరం చింతూరు గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా నియమించారు. తర్వాత రంపచోడవరం ఏఎస్పీగా, అనంతరం కర్నూలు సెబ్ ఏఎస్పీగా పనిచేశారు.

ఎన్నికల విధులపై తొలిరోజు నుంచే ఖరాఖండీ ఆదేశాలు

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచే వచ్చే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడడం ప్రథమ కర్తవ్యంగా భావించాలని కింది స్థాయి అధికారులకు ఖరాఖండీగా చెబుతున్నారు. సమీక్షల్లోనూ, పోలీసు స్టేషన్లు తనిఖీ చేసిన సందర్భాల్లోనూ అధికారులకు ఇవే చెబుతూ వచ్చారు. ముఖ్యంగా గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో జిల్లాకు చెడ్డపేరు వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో అలాంటివి పునరావృతం కారాదని తేల్చి చెప్పారు. ఎవరైనా గీత దాటితే నిర్మొహమాటంగా చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు కూడా నివేదిస్తామని కఠినంగా మాట్లాడుతూ వచ్చారు. ఆ క్రమంలో విధుల పట్ల అలక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించే కొందరు అధికారులకు చుక్కలు చూపించినట్టు ప్రచారంలో ఉంది.

'వీరప్పన్' స్థూపం ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



శాంతిపురం, మార్చి 3: శాంతిపురం మండలం కాకర్లవంకలో ఆదివారం గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ స్థూపాన్ని ఎమ్మెల్సీ భరత్ ఆవిష్కరించారు. వీరప్పన్ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన్నెకుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మండల వైసీపీ కన్వీనర్ దండపాణి మాట్లాడుతూ.. తమకు, తమ కులానికి వీరప్పన్ ఆరాధ్య దైవమన్నారు. ప్రభుత్వం దృష్టిలో అతను తప్పుచేసిన వ్యక్తిగా ముద్రపడినా, ప్రజల దృష్టిలో మాత్రం దేవుడయ్యాడన్నారు.

'స్వామి' పనికి మాలిన రాజకీయం మానేయాలి



తిప్పినాయుడుపల్లెలో విజయకేతనం చూపుతున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, మార్చి 3: డిప్యూటీ సీఎం నారాయణస్వామి పనికి మాలిన నీచ రాజకీయం మానేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ హితవు పలికారు. వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లె, తిప్పినాయుడుపల్లె కాలనీ, బీసీ కాలనీల్లో ఆదివారం జరిగిన మన థామస్-మన ఇంటికి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నారాయణస్వామి మోసపూరిత మాటలతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. తిప్పినాయుడుపల్లెలో డాక్టర్ థామస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

80 కుటుంబాలు టీడీపీలో చేరిక

తిప్పినాయుడుపల్లె పంచాయతీ నుంచి 80 కుటుంబీకులకు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి థామస్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రవిప్రకాష్, టీడీపీ ఎన్ఆర్ఐ నియోజకవర్గ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, నేతలు గుండయ్య, మరకాలకుప్పం సుధాకర్, బీగాల రమేశ్, కుప్పయ్య, నాగరాజు, పి.మోహన్ మురళి, కె.చెంగల్రాయరెడ్డి, కటికపల్లె రవికుమార్, భాష్యం సతీశ్ నాయుడు, కోలా జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం: భానుప్రకాష్



బహుమతులను ప్రదానం చేస్తున్న భానుప్రకాష్

నగరి, మార్చి 3: క్రీడలతోనే యువతకు మానసిక ఉల్లాసం కలుగుతుందని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి మండల పరిధిలోని మెళపట్టులో ఆ గ్రామ మాజీ సర్పంచ్ మధునాయుడు, స్థానికులతో కలిసి అంబేడ్కర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. అందులో బుచ్చినాయుడుకండ్రిగ జట్టు విన్నర్స్‌గాను, మేళపట్టు జట్టు ద్వితీయ స్థానం, పన్నూరు జట్టు తృతీయస్థానం సాధించాయి. విజేతలకు ఆదివారం గాలి భానుప్రకాష్ బహుమతులు ప్రదానం చేశారు. టీఎన్‌టీయూసీ బాలాజీ, పురుషోత్తం నాయుడు, సురేష్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, చిత్తూరు బాబు నాయుడు, రాజేష్, ప్రకాష్, శ్రీహరి, రఘు, రామచంద్ర నాయుడు, కమలాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టులో విజయం టీడీపీదే



మాట్లాడుతున్న మురళీమోహన్

తవణంపల్లె, మార్చి 3: పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించడం తథ్యమని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండ యాదవ్, ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని పుణ్యసముద్రం, మారేడుపల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నేత నరేష్



నరేష్‌కు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, మార్చి 3: చిత్తూరు రూరల్ మండలం, బీఎన్ఆర్ పేటకు చెందిన వైసీపీ నేత నరేష్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఆయన్ను జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ ఆయన నివాసంలో పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. రెండు రోజుల్లో ఈ వలసలు అధికంగా ఉంటాయని చంద్రప్రకాష్ తెలిపారు. టీడీపీ నాయకులు శశికర్‌బాబు, మోహన్‌రాజ్, రఘు, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



శ్రీరామపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నింద్ర, మార్చి 3: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మనోహర్ నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరామపురంలో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు కాటయ్య, మనోజ్ యాదవ్, ప్రసాద్ రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

100 లీటర్ల సారా స్వాధీనం



సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

గుడిపాల, మార్చి 3: మండలంలోని రాసనపల్లి అడవుల్లో ఆదివారం సాయంత్రం గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించి, సారా ఊటను ధ్వంసం చేసి, 100 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వెస్ట్ సీఐ రవిశంకర్ ఆదేశాల మేరకు రాసనపల్లి అటవీ ప్రాంతంలో సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో వెంటనే దాడులు నిర్వహించగా, సారా తయారు చేసే వ్యక్తి పరారయ్యాడని చెప్పారు. అక్కడున్న సారా ఊటను ధ్వంసం చేసి, 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడిని చూపిస్తున్న సీఐ విశ్వనాథరెడ్డి

చిత్తూరు, మార్చి 3: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి వివరాల మేరకు.. ప్రభుత్వ ఐటీఐ వెనుక భాగంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బంది దాడులు చేసి నగరానికి చెందిన ధనరాజ్(52) అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 250 టెట్రా ప్యాకెట్లను సీజ్‌చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

టీడీపీ క్రిస్టియన్ సెల్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేంద్రన్



గంగాధరనెల్లూరు, మార్చి 3: చిత్తూరు పార్లమెంట్ టీడీపీ క్రిస్టియన్ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా గంగాధరనెల్లూరు మండలం కోటాగరం దళితవాడకు చెందిన ఎస్.రాజేంద్రన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా టీడీపీ అధ్యక్షులు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్‌లు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు.

హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ

బంగారుపాళ్యం, మార్చి 3: హెల్మెట్ ప్రాణానికి రక్షణ కల్పిస్తుందని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సీఐ నాగరాజరావు సూచించారు. ఆదివారం బంగారుపాళ్యం మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్‌లందరూ హెల్మెట్ ధరించి పురవీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 18ఏళ్ల లోపు పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. మద్యం సేవించి వాహనాన్ని నడపరాదన్నారు. మండల మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు పురుషోత్తం నాయుడు, ఉపాధ్యక్షుడు జాకీర్, చంద్రబాబు, గౌస్, పలువురు మెకానిక్‌లు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

విజయపురం, మార్చి 3: మండలంలోని జగన్నాథపురం సచివాలయంలో అర్హులైన లబ్ధిదారులకు మంత్రి ఆర్కే రోజా ఆదివారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దార్ మల్లికార్జునరావ్, హౌసింగ్ డీఈ శంకరప్ప, ఏఈ ఏళుమళై, ఎంపీటీసీలు గోవిందమ్మ, రాజగోపాల్, సర్పంచ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్ నాయుడు, మండల వైసీపీ అధ్యక్షుడు గోపీనాథ్, నాయకులు భాస్కర్‌రాజు, చెంచురాఘవరాజు, మునికృష్ణ, మదన్‌రాజు, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే టీడీపీ విజయం: గురజాల

- పార్టీకి మద్దతుగా బెంగళూరు నుంచి చిత్తూరుకు భారీ కార్ల ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 3: అందరి సహకారంతోనే టీడీపీ విజయం సాధ్యమని పార్టీ చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఎస్టేట్‌లో ఉన్న ఆర్ఎల్ఎన్ కల్యాణ మండపంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రవాసాంధ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని విమర్శించారు. తిరిగి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాల్సిన ఆవశ్యకత ప్రజలపై ఉందని తెలిపారు. అన్ని వర్గాల వారూ సహకరించి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారిని పార్టీ విస్మరించదని, వారికి తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు. మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గత నాలుగున్నరేళ్లుగా చాలా మంది నేతలు, కార్యకర్తలు టీడీపీ కోసం పోరాడి కేసులు పెట్టించుకున్నారని, ఎన్నికలు దగ్గర పడటంతో రానున్న రోజుల్లో కీలకమైన పార్టీ నేతలు, కార్యకర్తలపైకూడా మరిన్ని కేసులు పెట్టే అవకాశం ఉందని జాగ్రత్త పరిచారు.

బెంగళూరు నుంచి భారీ కార్లర్యాలీ

కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో స్థిరపడిన ప్రవాసాంధ్రులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. ఆదివారం ఉదయం బెంగళూరు నుంచి సుమారు 400 కార్లలో మహాసముద్రం టోల్ గేట్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి ఎస్టేట్‌లోని ఆర్ఎల్ఎన్ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వారికి టోల్ గేట్ వద్ద గురజాల జగన్మోహన్ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, నేతలు కోదండయాదవ్, సుబ్రమణ్యం నాయుడు, వెంకటేష్ యాదవ్, అశోక్, ఈశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతు తెలిపిన బలిజ సేవా సంఘం

అదేవిధంగా ఆదివారం నగరంలోని బలిజసేవా సంఘం కార్యాలయంలో పారిశ్రామిక వేత్త డీకే బద్రీనారాయణ, బలిజసేవా సంఘం అధ్యక్షుడు ఓయం రామదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బలిజ సేవా సంఘం నేతలు టీడీపీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గురజాల జగన్మోహన్ బలిజ సేవా సంఘం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాజూరు బాలాజీ, కటారి హేమలత తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న బలిజసేవా సంఘం నేతలు

వసూళ్లలో టాప్

● తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని కృపాలక్ష్మి అక్రమార్జన చేశారంటూ థామస్ ఆరోపణ



వీరకనెల్లూరులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ థామస్

గంగాధరనెల్లూరు, మార్చి 3: రాజకీయాల్లోకి రాకముందే తన తండ్రి డిప్యూటీ సీఎం నారాయణస్వామి పదవిని అడ్డుపెట్టుకుని వివిధ పనుల కోసం వచ్చే వారి నుంచి డబ్బులు వసూలు చేయడంలో కృపాలక్ష్మి టాప్‌లో ఉన్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ఆరోపించారు. గంగాధరనెల్లూరు మండలం వీరకనెల్లూరులో తన నగదు రూ.5లక్షలతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ని ఆదివారం ఆయన నేతలతో కలిసి ప్రారంభించారు. ఎస్సీ సర్టిఫికెట్‌తో నారాయణస్వామికి డిప్యూటీ సీఎం పదవి, ఆయన సతీమణికి జడ్పీటీసీ, ఇప్పుడు కుమార్తెకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ వచ్చిందేకానీ, నియోజకవర్గ ప్రజలు బాగుపడలేదన్నారు. ఓట్ల కోసం వచ్చే వారి కుటుంబసభ్యులను ప్రజలే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధితో పాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సొంత చెల్లెళ్లు షర్మిల, సునీతలే సీఎం జగన్ ప్రభుత్వం వద్దంటున్నారని థామస్ అన్నారు. అంతకు మునుపు వీరకనెల్లూరు దళితవాడకు చెందిన వైసీపీ ఎంపీటీసీ మరిది ఏకాంబరం టీడీపీ కండువా కప్పుకుని థామస్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈసమావేశంలో జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు అరుణ, మండల టీడీపీ అధ్యక్షులు స్వామిదాస్, నేతలు లోకనాథరెడ్డి, రుద్రయ్య నాయుడు, విజయన్, నరేష్, చిరంజీవి నాయుడు, కోదండరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, దళితవాడ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి



యాదమరిలో జిల్లా గణాంకాల అధికారి జార్జ్, కాణిపాకంలో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, వెదురుకుప్పంలో ఎంపీడీవో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం

యాదమరి, మార్చి 3: ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలని జిల్లా గణాంకాల అధికారి జార్జ్ అన్నారు. ఆదివారం ఆయన ఎంపీపీ సురేష్‌తో కలిసి మండలంలోని మాధవరంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండల పరిధిలో 2361 మందికి చుక్కలు వేశామన్నారు. మాధవరం సర్పంచ్ రవి పాల్గొన్నారు.

ఐరాల: కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలో 2091 మందికి చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు స్వాతిసింధూర, రాజేశ్వరి తెలిపారు. అదేవిధంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్సిస్ట్ పాయింట్ ద్వారా 402 మందికి చుక్కలు వేశామని అన్నారు. అలాగే ఐరాల పీహెచ్‌సీ ద్వారా 2914 మందికి పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత తెలిపారు.

వెదురుకుప్పం: మండలంలో 4527 మందికి చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని పచ్చికాపల్లం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ తెలిపారు. చవటగుంటలో ఎంపీడీవో పురుషోత్తం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేఖ చుక్కలను వేసి ప్రారంభించారు.

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలంలో 2750 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని డాక్టర్లు గౌరి, బాలసుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మునస్వామి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలో 7136 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు బంగారుపాళ్యం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ తెలిపారు.

పెనుమూరు: మండలంలో 4307 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు. పెనుమూరు బస్టాండులో ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: నింద్రలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ దీప ప్రారంభించారు. మండలంలో 2777 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో భవాని, వైద్యాధికారి సుమలత, సర్పంచ్ వసంతబాబు రెడ్డి, వైస్ ఎంపీపీ శుభరాము, అనిల్ కుమార్, నాయకులు శ్యాముల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజు ఆర్టీసీ బస్సులకూ సెలవే... !

విజయపురం, మార్చి 3: ప్రభుత్వ సెలవు రోజు ఆర్టీసీ బస్సులకు కూడా అధికారులు సెలవు ఇచ్చేస్తున్నారని మండల అంబేడ్కర్ యూనియన్ అధ్యక్షుడు సెల్వం ఆరోపించారు. ఆదివారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ సెలవు రోజు నగరి - కనకమ్మసత్రం రూట్‌లో ఉన్న రెండు బస్సులలో ఒక బస్సును రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఆటోలను నమ్ముకొని సమయానికి గమ్యస్థానానికి చేరుకోలేక పోతున్నామని వాపోయారు. ఈ విషయమై పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజరు స్పందించి చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

వైసీపీకి మద్దతుగా కాపుల ర్యాలీ

చిత్తూరు, మార్చి 3: చిత్తూరు నియోజకవర్గంలోని కాపు కులస్థులంతా వైసీపీకి మద్దతుగా ఉంటామని తెలిపారు. చిత్తూరు అసెంబ్లీ అభ్యర్థి విజయానందరెడ్డికి మద్దతుగా గంగినేనిచెరువు వద్ద ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాపు నాయకులు మధుసూదన్ రాయల్, నందగోపాల్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శ్రీరంగరాజపురం, మార్చి 3: మండలంలోని ఆరిమాకుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2003-2004 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆదిమాకులపల్లె పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు బాల్యంలో తాము పాఠశాలలో చేసిన అల్లర్లను నెమరు వేసుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, మోహన్ నాయుడు, గోపినాథ్, విశ్వనాథ్ ఆచారి, జగన్నాథ నాయుడు,, శ్రీహరి, ధనలక్ష్మి, ఊర్మిళ, ఉపాధ్యాయుల బృందం, పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



పెనుమూరు, మార్చి 3: ఎక్కడెక్కడో పుట్టి పెరిగి చదువుల ఒడిలో ఒకటైన పూర్వ విద్యార్థులు చాలా కాలం తరువాత కలిసి ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1984-85 సంవత్సరం పెనుమూరు మండలంలోని ఉగ్రాణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కలిశారు. ఈ సందర్భంగా వారు పాఠశాల ఆవరణలో స్టేజీ నిర్మిస్తామని తెలిపారు. అనంతరం గురువులైన రామ్మూర్తి ఆచారి, విజయభాస్కర్ రెడ్డి, సరస్వతిలను సన్మానించారు. కృష్ణమ నాయుడు, మురళీ నాయుడు, బాలాజి, కాంతారావు, శ్రీనివాసులు రెడ్డి, లోక, పద్మ, దేవీప్రభ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో జాగ్రత్తగా ఉండాలి

పెనుమూరు, మార్చి 3: రానున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో మండలంలోని రౌడీ షీటర్లు, పలుకేసుల్లో ముద్దాయిలుగా ఉన్నవారు జాగ్రత్తగా నడుచుకోవాలని ఎస్ఐ లోకేశ్ సూచించారు. ఆదివారం ఆయన 40 మంది రౌడీషీటర్లను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడకుండా, గొడవలు చేయకుండా గ్రామాల్లోనే ఉండాలని సూచించారు. ఏఎస్ఐ ఉమామహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

చిత్తూరు, మార్చి 3: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు.

ఏఆర్ ఏఎస్సైకి సన్మానం



ఏఎస్సై సెల్వరాజ్‌కు ఊరేగింపు నిర్వహిస్తున్న కట్టమంచి ప్రజలు

చిత్తూరు, మార్చి 3: చిత్తూరు ఏఆర్ ఏఎస్సైగా పనిచేసి పదవీ విరమణ పొందిన సెల్వరాజ్ సేవలు మరువలేనివని వన్నియ కుల క్షత్రియ సంఘం కార్యదర్శి కట్టమంచి కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రైవేట్ కల్యాణ మండపంలో జరిగిన పదవీ విరమణ సభలో సెల్వరాజ్‌ను పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, కట్టమంచి ప్రజలు దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కల్యాణ మండపం నుంచి ఓపెన్ టాప్ జీప్‌కార్‌లో బాణసంచా పేల్చి, మంగళ వాయిద్యాలతో సెల్వరాజ్ నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, మార్చి 3: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వున్న అన్నక్యాంటీన్‌లో ఆదివారం మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి తన తల్లి కళావతి జ్ఞాపకార్థం భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణపతి నాయుడు, కాంతారావు, సీకే చిట్టి, ఊట్ల నాగరాజ నాయుడు, హేమాద్రి నాయుడు, దాము, భాస్కర్, ఏకాంబరం, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దొరబాబు చౌదరి తదితరులు

ఘనంగా టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం

తవణంపల్లె, మార్చి 3: మండలంలోని కాణిపాకంక్రాస్ వద్ద గల వినాయక విద్యామందిరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గణపతి నాయుడు మాట్లాడుతూ పట్టుదల, సంకల్పం ఉంటే దేనినైనా సాధించవచ్చునన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదుల వేసి జీవిత గమ్యానికి బాటలు వేసేవారు గురువులన్నారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఎదిగినా తల్లిదండ్రులను, గురువులను మరవకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న జయహో రాష్ట్రస్థాయి బీసీ డిక్లరేషన్ సభ

గంగాధరనెల్లూరు, మార్చి 3: మంగళగిరిలోని నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 5వ తేది మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు జరగనున్న జయహో రాష్ట్రస్థాయి బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ టీడీపీ లీగల్‌సెల్ కార్యదర్శి లాయర్ శరవణకుమార్, మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, మండల టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు మునిరాజులు యాదవ్‌లు పిలుపునిచ్చారు. ఈ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, జాతీయ టీడీపీ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్, మాజీ మంత్రి కొల్లు రవీంద్రలు హాజరవుతారని, బీసీ కులాలకు చెందిన టీడీపీ నేతలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.